# గండి

"అలా పొలం ఎల్లొత్తాను" అన్నాడు లోవరాజు భోంచేసి, కంచం ముందు నుంచి లేస్తూ.

"పొద్దుటేగందా ఎల్లొచ్చినావు. మళ్ళీ ఇప్పుడెందుకంట? పొలం గట్లమీద పచ్చగడ్డి మొలనిచ్చేలాగలేవు" అంది వెంకమ్మ కంచం తీస్తూ వేళాకోళంగా.

"ఆడోల్లు పిల్లల్నీ, ఇంటినీ సాకినట్టుగా మేం పసువుల్నీ, పొలాన్నీ సాకాల. అప్పుడే అయి సల్లగా, పచ్చగా వుంటాయి. మనవూ సల్లగా వుంటాము. నీరెట్టి, ఎరువేసి, కలుపుతీసి, మందేసి పొలాన్ని జాగర్తగా సూసుకుంటే పది బత్తాల పంటొచ్చేదల్లా ఇరవైబత్తాల పంటొత్తాది. అలాగే మన గేదెకి పచ్చగడ్డితో పాటు దానా కూడా రోజూ యెట్టేవనుకో, శేరు పాలిచ్చేదల్లా శేరున్నర పాలిత్తాది. ఐతే, మన దగ్గర డబ్బు లేదుగనుక దానా యెట్టలేక పోతన్నావు. అలాగని దాన్ని సూట్టంలేదనికాదు. మనకున్నంతలో దాన్ని బానే సూత్తన్నావనుకో. నీ కింకో ఇసయం సెప్పాల. నువ్వు నీ మొగుణ్ని సక్కగా సాకాల, అప్పుడు నీ మొగుడూ నిన్ను నెత్తిమీద యెట్టుకుంటాడు."

"నిన్ను కదపడమంటే కందిరీగ తుట్టను కదపడమే. నీ సోది ఇంటూ నిలబడ్డానికి నాకు తీరిక నేదు. రేపు సేవణసుక్కు రోరం. ఇల్లలికి, ముగ్గులెట్టాల. నోవు నోసుకోవాల ఓ కొత్త సీర కొనవయ్యా అని నేనెంత అడిగినా నువ్వు కొనకపోతివి" అంది వెంకమ్మ చిరుకోపాన్ని గొంతులోనూ, ముఖంలోనూ ప్రతిబింబిస్తూ.

"నోవులు నోసుకోవద్దన్నానా? దేవుడికి మొక్కులు మొక్కుకోవద్దన్నానా? కొబ్బరికాయలు కొనితెచ్చాను. అరటిపళ్ళు, తవలపాకులూ కొని తెచ్చేను. దేవుడు నీ బక్తిని సూత్తాడుగానీ, నీ సీరని సూత్తాడేటే, సూత్తే మాత్తరం నేనూరుకుంటానా" అన్నాడు లోవరాజు నవ్వుతూ.

"సాల్లే సంబడం. నోటికెంతొత్తే అంతా పేలేయడమే నీకు సేతనవును" అంది వెంకమ్మ కంచం తీసిన చోట పేడతో అలుకుతూ.

తాటాకు ఇంటి చూరులోంచి కొడవలి తీసి లోవరాజు బయటకు వచ్చాడు. పొలంకేసి నడవబోతూ ఆగి, వెనక్కి తిరిగి ఇంటి చూరుకింద ఓ పక్కగా కట్టేసిన గేదెదగ్గరి కెళ్ళాడు. గేదెముందున్న ఒకటి, రెండు పచ్చగడ్డి పరకల్ని చూశాడు. గేదెకి కొంచెం దూరంలో లేగదూడ పడుకొని వుంది. పొద్దుట తెచ్చిన పచ్చగడ్డి కొంచెం వుంటే దాన్ని తెచ్చి లేగదూడముందు వేశాడు. లేగదూడ నుదురును ప్రేమగా నిమిరాడు. తర్వాత ఇంటికటువైపునున్న చూరుకింద వేసిన ఎండు గడ్డి మేటు దగ్గరికి వెళ్ళాడు. ఎండు గడ్డిని రెండు చేతులతోనూ లాగి గేదె ముందువేసి, దానివీపు మీద చిన్న చరువు చరిచి, పొలంవైపు కదిలాడు.

లోవరాజు ఏనుగు గట్టుమీదకు వచ్చాడు. ఏనుగు గట్టుకు అటూ ఇటూ పంట పొలాలు పచ్చపచ్చగా మెరిసిపోతున్నాయి. లోవరాజుకి పచ్చని తన చేనును చూడగానే మనసుకు హాయిగా అనిపించింది.

పొట్టకొచ్చిన వరిపైరు గర్భిణీ స్త్రీలా నిండుగా వుంది. నడుం ఎత్తుకు పెరిగిన పైరు చల్లగాలికి మెల్లగా కదులుతోంది.

ఏనుగు గట్టు దిగి, లోవరాజు తన పొలం గట్టుమీ ది కెళ్లాడు. గట్టు కొసదాకా నడిచాడు. పక్కనే పిల్లకాలవ ప్రవహిస్తోంది నిదానస్తుడిలా. పిల్లకాలవ గట్టు మీద కూచుని, కొడవలి పక్కనేవుంచి చేనుకేసి చూశాడు లోవరాజు.

లోవరాజుకున్న ఎనిమిది కుంచాల పొలమూ పిత్రార్జితం. బాగా పండితే పాతిక బస్తాల దిగుబడి వుంటుంది. అందులో పెట్టుబడిపోనూ పది పన్నెండు బస్తాలు మిగులుతాయి. ఏడాది పొడుగునా తిండికి అవి సరిపోవు. సొంత పొలంలో పని లేనప్పుడు లోవరాజు కూలిపనికిపోతాడు. ఆ కూలిడబ్బులతోనే పై ఖర్చులు పెడుతుంటాడు.

కొడవలి తీసుకుని, గొంతుక్కూర్చుని పిల్లకాలవ గట్టుపైనున్న పచ్చగడ్డిని కోయడం మొదలెట్టాడు లోవరాజు. 'ఈ ఎనిమిది కుంచాల పొలాన్నీ తను నిలబెట్టుకోగలడా?' - ఈ ఆలోచన రాగానే లోవరాజు గుండె గిలగిలలాడి పోయింది.

పెద్దకూతుర్ని కిందటేడే పెళ్ళిచేసి, అత్తవారింటికి పంపించాడు.

పెద్దకూతురి పెళ్ళిచేసినందుకు సంతోషించినా, ఆ పెళ్ళికి పొలంమీద అయిదు వేల రూపాయల అప్పుచేయవలసి వచ్చినందుకు తెగబాధపడిపోయాడు. 'వందకూ నెలకూ మూడు రూపాయల వడ్డీ. ఈపాటికి వడ్డీ ఎంతయివుంటాదో' అనుకుని

మనసులో లెక్కలు వేశాడు. అతని మనసు వికలమైపోయింది.

కోసిన పచ్చగడ్డి పనల్ని ఓచోట చేర్చి చిన్న మోపుగా కట్టాడు. మళ్ళీ మోపుపక్క చతికిలబడి, కాళ్ళను చేలోవేసి కూర్చున్నాడు. వరిపైరును చేత్తో తడిమాడు. అప్పులు దగ్గరున్నట్టనిపించింది. తలపాగా చుట్టిన తువ్వాలు విప్పి, దులిపి ముఖం తుడుచుకున్నాడు.

'అప్పుడే ఏడొందలకుపైగా పొలం కర్సులయిపోనాయి. పైరు పొట్టమీది కొచ్చినాది. ఇంకొన్ని రోజులుపోతే దొంగ నా దోమ మొదలవుతాది. దోమల మందు కొని వుంచుకోవాల. అందుకు డబ్బు కావాల. రేపటినుంచి కూలిపని కెళ్లాల' అనుకున్నాడు లోవరాజు.

"ఇంకా సిన్నమ్మాయి మనువుకావాల. పెద్దమ్మాయిని సాగనంపడానికి సేసిన అప్పు తీర్చాల - ఇయన్నీ ఎలాగవుతాయి. నానూ కూలిపని సేత్తాను" అంది ఈ మధ్య వెంకమ్మ.

"ఎదవ కబుర్లు సెప్పమాక. ఆడోల్లు కూలిపనికి ఎల్లడాలు మా ఇంటా వంటా లేవు."

"మింగ మెతుకునేదు, మీసాలకి సంపంగినూని అని నీలాంటోల్లను సూసే అన్నారు. నానూ పనిసేత్తే ఏణ్ణీలకు సన్నీలు తోడవుతాయిగందా"

"నేను సచ్చేక నువ్వు కూలిపనికి ఎల్లువుగానిలే. నువ్వు కూలిపని సెయ్యడం నేను సూడలేను. నా తిప్పలేవో నాను పడతానుగానీ, నువ్వింక ఆవూసు ఎత్తమాక" అని లోవరాజు కోప్పడ్డాడు. వెంకమ్మ మొగుడితో వాదించి, వాదించి ఇక లాభంలేదని తేలేక మౌనం వహించింది.

చుట్టూ చీకట్లు అలముకుంటున్నాయి. లోవరాజు పచ్చగడ్డి మోపు నెత్తిమీద కెత్తుకుని, ఓ చేత్తో కొడవలి పట్టుకుని ఏనుగు గట్టుమీదకొచ్చి, ఇంటికెళ్ళబోతూ ఓసారి తన పొలాన్ని చూసుకున్నాడు.

'పైరు మాంచి వత్తుగా పెరిగినాది. దేవుడు సల్లగాసూత్తే ఈ యేడు ముప్పైకాటాలన్నా తూగుతాయి' అనుకున్నాడు ఆశగా అంచనావేస్తూ.

☆ ☆ ☆

"ఛీర్స్'

'ఛీర్స్ - ఛీర్స్ - ఛీర్స్'

నలుగురూ గ్లాసుల్ని నోటికానించారు.

కామేశ్వరరావు ఓ గుటకేసి, జీడిపప్పు పలుకుల్ని నోట్లో వేసుకుని, 555 సిగరెట్ వెలిగించాడు. మిగలముగ్గిన దబ్బపండులా వుంటాడతను. అక్కడక్కడ నెరిసిన తల, సిగరెట్లు తెగకాల్చడంవల్ల నల్లబడిన బండపెదాలు. కుడిచేతి చిటికిన వేలుకి వెంకటేశ్వరుడి బొమ్మవున్న బంగారపు ఉంగరం. ఎడంచేతికి బంగారపు చైన్‌వున్న సీకో వాచీ. మెడల్లో సన్నపాటి గొలుసు - అదీ బంగారందే. కామేశ్వరరావులాగే అతని రెండతస్తుల మేడ మెరిసిపోతూ అట్టహాసంగావుంది.

మేడలోని కిందిహాల్లో ఈ మందు పార్టీ జరుగుతోంది. వాళ్ళలో ఎవరైనా ఒకడు ఈ వైపు చూస్తే నిలువెత్తు పెయింటింగ్ కనిపిస్తుంది. అక్కడ నయాగరా జలపాతం ఉరకలేస్తూ దూకుతోంది. బుర్ర తిప్పకుండా తిన్నగాచూస్తే మొండిచేతుల నగ్నసుందరి - "ఇది నా తప్పుకాదు. నా మానాన్ని దాచుకోవడానికైనా వీల్లేకుండా చేసిన పురుషులది" అన్నట్లు అర్ధనిమీలిత నేత్రాలతో దర్శనమిస్తుంది. ఎడంపక్కకు చూస్తే ఫారిన్ కలర్ టి.వి. దానిపై కామేశ్వరరావు పెళ్ళినాటి ఫోటో.

"రావ్..... ఇవేళేమైనా ప్రత్యేకత వుందా?" అన్నాడు రామగోపాలం గ్లాసు ఖాళీచేస్తూ.

"మనం నలుగురం కలిసి కూర్చోడమే ప్రత్యేకత" అన్నాడు కామేశ్వరరావు సిగరెట్ దమ్ములాగుతూ.

'ఏలాభం లేకుండా నువ్వు పార్టీ ఎందుకిస్తావ్. ఇవేళకాకపోతే ఇంకోనాడైనా ఇంతకింతా లాగుతావు" అని మనసులో అనుకుని, "నిజం చెప్పారు" అన్నాడు శ్రీనాథ్ సిగరెట్ పీకను యాష్ట్రేలో నొక్కుతూ.

"మనవాడికేమోయ్...ఇంట్లో పార్టీ పెట్టినా, ఏంచేసినా ఆవిడ అడ్డుపడరు"

"నిజం చెప్పారు" అని, వీడు ఆవిడకూ అడ్డురాడుకదా' అనుకున్నాడు శ్రీనాథ్.

"మొన్నటి కాంట్రాక్టులో అయిదు లక్షల లాస్ వచ్చింది. మనసు బాగోక ఫ్రెండ్స్‌తో కాసేపు గడుపుదామని మిమ్మల్ని పిలిచాను" అన్నాడు కామేశ్వరరావు నాలుగు గ్లాసులూ 'వేట్'తో నింపుతూ.

"అయ్యో.... అలాగా. ఏం ఫర్లేదు భాయ్! నేకేంటి? మరో కాంట్రాక్టలో పది లక్షలు సంపాదించగలవు" అన్నాడు రామగోపాలం జీడిపప్పు కమ్మదనాన్ని ఆస్వాదిస్తూ.

"నిజం చెప్పారు" అనబోయి,

"బలహీనవర్గాల కాలనీతోపాటే వేసిన పది లక్షల ఖరీదుచేసే ఈ మేడమాటేటి? అయిదు లక్షల నష్టంపోనూ మరో అయిదు లక్షలు లాభమేకదా గురూ" అనుకుంటూ శ్రీనాథ్ దొంగ దగ్గు దగ్గేడు.

తర్వాత గ్లాసందుకుని ఓ గుటకేసి,

"నిజం చెప్పాలంటే ఈమధ్య కాంట్రాక్టుల్లో లాభాలు అసలు రావడం లేదు గోపాలంగారూ! లేబర్ కాస్ట్లీగా వుంది. పోటీ పెరిగింది. తక్కువ రేటుకి టెండర్ పెడితేనేకానీ వర్క్ దొరకదు. నువ్వు లాభం వచ్చిందంటే ఆశ్చర్యపోవాలి కానీ, నష్టం వచ్చిందంటే ఆశ్చర్యం లేదు రావ్" అన్నాడు శ్రీనాథ్ ముక్కు నలుపుకుంటూ.

"నువ్వూ కాంట్రాక్టరివే కనుక ఈ మాటన్నావ్"

"మన కష్టాలు మనకే తెలుసు బ్రదర్"

కూర్చున్నది నలుగురయినా ముగ్గురే మాట్లాడుతున్నారు. నాలుగోవ్యక్తి నాలుగో పెగ్ అయితేనే కానీ గొంతు విప్పడు. అంతవరకూ చిర్నవ్వులు చిందిస్తూ మధ్యమధ్య తల వూపుతూ వుంటాడు. ఈ సంగతి మిగతా ముగ్గురికీ తెలుసు. అందుకే అతన్ని పట్టించుకోకుండా వాళ్లు రాజకీయాలమీదకి, సినిమాలమీదకి వెళ్లారు.

ఖాళీ అయిన ప్లేట్లను పనికుర్రాడిచేత తీయించి, చికెన్‌ఫ్రైను స్టీలు గిన్నెల్లో సర్దించి, తమ ముందున్న నగిషీ బల్లమీద పెట్టించాడు కామేశ్వరరావు.

నలుగురూ మూడోరౌండ్‌లోకొచ్చారు. ఇంతలో కామేశ్వరరావు పక్కనే వున్న తెల్లన్టూలు మీది తెల్లఫోను గణగణమని మోగింది. కామేశ్వరరావు మొహం చిట్లించి, ఫోన్ ఎత్తి 'హలో' అన్నాడు.

అవతలి గొంతును గుర్తుపట్టి ముఖం నిండా నవ్వునూ, గొంతునిండా సంతోషాన్నీ నింపుకుని -

"నమస్కారంసార్....బావున్నారా? మీ అబ్బాయి స్టేట్స్ నుంచి వచ్చేశాడా?" అని ఎంతో అభిమానం కనబరుస్తూ అడిగాడు కామేశ్వరరావు.

తర్వాత "ఏవిటిసార్! గండిపడిందా? ఏటీ... గోదావరి ఆనకట్టకే! ఏం ప్రమాదం లేదుకదా" అని ఆందోళన వ్యక్తం చేశాడు.

ఆ తర్వాత, కాసేపు ఎస్ సర్, ఓ.కే.సర్, అలాగే, మీకెందుకు శ్రమ వంటి మాటలతో గుంభనంగా మాట్లాడి, ఫోన్ పెట్టేశాడు కామేశ్వరరావు.

"ఆ...... ఆనకట్టకు గండి పడిందా"

అని అడిగాడు శ్రీనాథ్ ఎంతో ఆత్రుతగా.

"పెద్ద ప్రమాదమేమీ లేదట"

"ప్రభుత్వం కళ్లుమూసుకుని కూర్చోడంవల్లే ఈ అనర్థం వచ్చింది" అన్నాడు రామగోపాలం చికెన్‌ముక్క నములుతూ.

"నిజం చెప్పారు" అని,

"ముందు నీ సినిమా హాల్లో బ్లాకు టికెట్లమ్మకుండా చూద్దూ" అనుకున్నాడు శ్రీనాథ్."ఊ.... కాంట్రాక్టుకూడా కామేశంగాడు కొట్టేస్తాడో ఏటో" అనికూడా ఆందోళన చెందాడు.

'నాకు ఫోన్ చేసింది ఇంజనీర్ అని శ్రీనాథ్‌గాడు పసిగట్టలేదుకదా? జాగర్తగా మేనేజ్‌చేసి ఈ కాంట్రాక్టు సంపాదిస్తే కానీ ఆ అయిదు లక్షల నష్టం పూడదు" అనుకుంటూ కామేశ్వరరావు ఖాళీ అయిన నాలుగు గ్లాసులూ నింపాడు.

☆ ☆ ☆

ఎప్పుడూ గలగలా ప్రవహించే గోదావరి ఈసారి గాండ్రించింది. ప్రాణాల్ని నిలబెట్టే చల్లని తల్లే పరవళ్లు తొక్కుతూ పళ్లు కొరికింది.

గట్ల మధ్య ప్రవహించడం గోదావరికి ఎంతో కష్టంగా వుంది. ఇరుకు గదిలో వున్నట్టుంది. ఉరకలువేసే గోదావరి గట్ల మధ్య ఉక్కిరి బిక్కిరి అవుతూ, పుడమి తల్లి బలహీనంగా వున్న చోటల్లా పదునైన కత్తిలా మారి, సర్రున కోసేస్తూ పక్కదారులు పట్టింది. ఆ ధాటికి తాళలేక చెట్లు ఫెళ ఫెళలాడుతూ విరిగి, నేలకొరిగి పోతున్నాయి. నీరు నాగుపాములా పాకుతోంది బుసలు కొడుతూ. వరద గోదావరి ప్రళయ గర్జనతో విలయ తాండవం చేస్తూ ఊళ్ళపై పడుతోంది. పంట కాలవల్లోకి వెళ్తోంది.

కొన్నిచోట్ల ఇళ్ళు కూలిపోయాయి. గుడిసెలు నీటిలో పడవల్లా తేలుతూ పోతున్నాయి. కొన్ని చోట్ల ఇంటి పైకప్పుల వరకూ నీరు. పొలాలు చెరువులైపోయాయి. చెరువులు నదులైపోయాయి. చెట్లు వస్తున్నాయి. శవాలు కొట్టుకువస్తున్నాయి. నీరు, నీరు, నీరు...... ఎక్కడ చూసినా నీరు!

☆ ☆ ☆

వరదల కబుర్లు వింటూ లోవరాజు భయపడిపోయాడు. పిల్లకాలవ ఎగదన్నేసింది. పిల్లకాలవలోని నీరు పంట పొలాల్లోకి వచ్చేస్తోంది.

ఇంతలో ఊరి ప్రెసిడెంటుగారి నౌకరు పరిగెత్తుకుని వచ్చాడు.

"అయ్యగారు మిమ్మల్నందరినీ బేగా రమ్మన్నారు" అన్నాడతను వగురుస్తూ. లోవరాజుతోపాటు ఆ పేటలోని వాళ్ళంతా వెళ్ళారు. అప్పటికే ప్రెసిడెంటు ఇంటి ఆవరణంతా ఊరి జనంతో నిండిపోయింది.

"మనూరికి వరద వచ్చేస్తోంది. ఊరిని ఖాళీ చేయమని రేడియోలో కూడా చెప్పారు. మనం ఊళ్ళోనే వుండాలంటే పెద్ద కాలవకు అటుపైన గండికొట్టాలి. అలాచేస్తే వరదనీరు అటు వెళ్ళిపోతుంది. మన వూరికేం ప్రమాదం వుండదు." అన్నాడు ప్రెసిడెంటు జనాన్ని చూస్తూ.

జనం మౌనంగా వుండిపోయారు. వాళ్ళకంతా అయోమయంగా వుంది. ప్రెసిడెంటు ఇక ఆలస్యంచేస్తే లాభంలేదని చెప్పి తను ముందుకెళుతూ, "రండి..గునపాలూ పారలూ పట్రండి" అన్నాడు.

కాలవగట్లు వరదనీటితో వొరుసుకుపోతున్నాయి. గండి ఎక్కడ కొడితే బావుంటుందో ప్రెసిడెంటు చెప్పాడు. కాలవగట్టుకు గండికొట్టడం మొదలెట్టారు. అంతలో ఆ పక్క వూరివాళ్లు వీళ్లను చూశారు. గబగబావచ్చి గండి కొట్టడానికి వీల్లేదన్నారు. గండి కొడితే తమ వూరు తుడిచిపెట్టుకు పోతుందన్నారు. మాటామాటా పెరిగింది. చేయీ చేయీ కలిశాయి. రక్తం చిందింది. దాంతో ప్రెసిడెంటు వెనకడుగు వేశాడు. అతన్ని చూసి జనమూ వెనక్కు మళ్ళారు.

"ఒరే..మీవన్నీ పూరిగుడిసెలు, వరద వచ్చేక ఏమవుతుందో తెలీదు. మేం వూరు విడిచి వెళ్తున్నాం.... వచ్చేవాళ్ళురండి" అని ప్రెసిడెంటు ట్రాక్టర్‌నుస్టార్ట్‌చేశాడు.

ట్రాక్టరు తొట్టెలోకి ఓ నలభైమంది ఎక్కారు. తర్వాత ఆ వూళ్ళోని మరో మూడు ట్రాక్టర్లను బయల్దేరదీశారు. పక్కా ఇళ్ళున్నవాళ్ళల్లో చాలామంది వూరు విడిచి వెళ్ళదలచలేదు.

లోవరాజు పేటలోనివాళ్ళంతా ట్రాక్టరు తొట్టెల్లోకెక్కారు. అతన్నీ రమ్మన్నారు.

"నేనురాను" అన్నాడు లోవరాజు తాటాకు పాకలోని గేదెనూ, దూడనూ చూస్తూ.

వెంకమ్మ పదేళ్ళ కూతుర్ని ట్రాక్టరెక్కించి, లోవరాజు దగ్గరకొచ్చి,

"నీకేమన్నా పిచ్చా! అంతా ఎర్రోల్లయి ఎల్తున్నారేటి? దాదా" అని అతని చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళింది.

లోవరాజు ఏడుపు మొహంతో ట్రాక్టరెక్కాడు. మళ్ళీ అంతలోనే గబుక్కున దిగి పాకలోకి వెళ్ళాడు. ఒంగుని గేదెకాలుకి కట్టిన డెక్కతాడు విప్పాడు. దూడ దగ్గిరికి

తోలుకెళ్ళాడు. లేగదూడ నుదురును ప్రేమగా నిమిరాడు. గేదె వీపు మీద ఆప్యాయంగా చరిచి, నీళ్లు నిండిన కళ్ళతో ట్రాక్టరు తొట్టె ఎక్కాడు.

☆ ☆ ☆

ఆ హైస్కూలులోని గదులన్నీ వరద బాధితులతో నిండిపోయాయి. నాలుగు రోజులుగా వాళ్ళంతా అక్కడ తలదాచుకున్నారు. ఎవరి ముఖం చూసినా దిగులే. సరిగా నిద్రలేక, తిండిలేక అందరి ముఖాలూ పీక్కుపోయాయి. వాళ్ళ మనసులనిండా దిగులు, తమ కొంపా గూడూ ఏవయ్యాయోనని గుబులు.

ఓ లారీలో కొన్ని స్వచ్ఛందసంస్థలు పంపిన ఆహారం పొట్లాలొచ్చాయి. అంతా ఎగబడి వాటిని తీసుకున్నారు. ఆబగా పొట్లాలు విప్పి పులిహోర తిన్నారు.

"ఏవేం..... మన చేనంతా మునిగిపోయుంటాదంటావా? మన గేదె, దూడ ఏమయ్యాయో'

"ఎంత కసాయివాడివయ్యా నువ్వు! చేను ఏవయ్యిందోననీ, గేదె, దూడ ఎలా వున్నాయోననీ ఈపాటికి పదిసార్లన్నా అడిగావుగానీ, పెద్దమ్మాయి ఎలాగుందోనని ఒక్కసారన్నా అనుకున్నావా?" అంది వెంకమ్మ కన్నీళ్లు పెట్టుకుంటూ నిష్ఠూరంగా.

"మనలాగే అదీ ఎక్కడికో చేరుంటాది. దాని గురించి బెంబేలుపడమోక" అని లోవరాజు భార్యకు ధైర్యం చెప్పాడు.

ఆ సాయంత్రం జీపులో వచ్చిన అధికారి అక్కడున్న జనం ఏవూరివాళ్ళో తెలుసుకుని, "వరద పూర్తిగా తగ్గింది. రేపు మీరంతా మీ వూరికి వెళ్ళిపోవచ్చు" అని చెప్పాడు.

☆ ☆ ☆

లోవరాజు శ్మశానంలా వున్న తన వూరిని చూశాడు. కళ్లుమూసుకున్నాడు. బుర్ర గిర్రున తిరుగుతోంది. తమ పేటలోకెళ్ళాక, ట్రాక్టరు దిగి తన గుడిసెవైపు చూశాడు. నేలమట్టమై వుంది. గేదె, దూడ కనిపించలేదు. వరదనీటిలో కొట్టుకుపోయాయో, ఏ సురక్షిత ప్రాంతాలకైనా చేరుకున్నాయో తెలీదు.

వెంకమ్మ లోవరాజు వైపు బిత్తర చూపులు చూసింది. కొన్ని గుడిసెల ఆచూకీయేలేదు. ఆడవాళ్ళ ఏడుపులతో అక్కడంతా గోలగోలగా వుంది.

లోవరాజు తన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగుమింగుకుంటూ తన పొలం దగ్గరికెళ్లాడు. మొన్నటివరకూ పచ్చపచ్చగా కళకళలాడిన పొలం కుళ్ళి కంపుకొడుతోంది. వరిపైరు

నామరూపాలు లేకుండా పోయింది. లోవరాజు గుండె గిలగిలలాడిపోయింది. అతనికిక దుఃఖం ఆగలేదు.

"గండ్లు పూడ్చేపని మొదలెట్టారట" అని దారిలో ఎవరో అన్నమాట లోవరాజుకు గుర్తొచ్చింది.

'గండ్లు ఎప్పటికో ఒకప్పటికి పూడుత్తారు. కానీ, నా బతుక్కి పడ్డ గండి ఎప్పటికన్నా పూడతాదా' అనుకున్నాడు లోవరాజు.

ఏ గండి పూడినా ఈ గండి మాత్రం పూడేదికాదని అతని నలభై అయిదేళ్ళ జీవితానుభవం తెలపడంతో లోవరాజు వెక్కివెక్కి ఏడుస్తూ, నిలబడే శక్తిలేక అక్కడే కుప్పకూలిపోయాడు.

☆ ☆ ☆

కొందరు క్రేన్లతో పెద్ద పెద్ద రాళ్లను పైకెత్తి నీట్లోకి పడేస్తున్నారు. కొందరు గోనె సంచుల్లోకి ఇసుక పడుతున్నారు....అక్కడంతా హడావుడిగా వుంది. గండి పూడ్చేపని "యుద్ధప్రాతిపదిక" మీద జరుగుతోంది.

"సార్.....కూలి పనికోసం వందల మంది వచ్చారు. తీసుకోమంటారా" అని వినయంగా అడిగాడు మేస్త్రీ.

"ఇప్పుడున్నవాళ్లు చాలు... ఇంకా ఎందుకు" అన్నాడు కామేశ్వరరావు మొహం చిట్లిస్తూ.

"ఇప్పుడున్న వాళ్ళతోనే అయితే గండి పూడ్చేపని మూణ్నెలయినా పూర్తికాదు. వచ్చేనెలకల్లా పూర్తిచేయాలంటే చాలామంది కావాలి."

"కూలి పనికోసం వచ్చినవాళ్లు ఎక్కడున్నారు?"

"అరుగో...ఆ రాళ్ళ గుట్ట దగ్గర" అన్నాడు చేత్తో చూపెడుతూ మేస్త్రీ.

కామేశ్వరరావు 555 సిగరెట్ వెలిగించి, అటువైపు వెళ్ళి రాళ్ళగుట్ట దగ్గరున్న వాళ్ళను చూశాడు. తలపంకించాడు. మరికొంచెం ముందుకెళ్లాడు. అతని వెనకే మేస్త్రీ కదిలాడు.

"మగోడికి పది రూపాయలు, ఆడదానికి ఏడు రూపాయలు ఇస్తాం. నిజానికి మాకు కూలివాళ్ళ అవసరం లేదు. మీ ముఖాలు చూసి, పొమ్మనలేక తీసుకుంటున్నాను. మీకిష్టమైతే రండి" అన్నాడు కామేశ్వరరావు సిగరెట్ దమ్ము గట్టిగా లాగుతూ.

"మాపల్లెటూళ్ళల్లోనే మొగోడికి ఇరవై, ఆడబొట్టికు పదేనూ ఇత్తారు. మరీ ఇదేం

గోరం'' అని ఒకప్పుడైతే వాళ్లల్లో ఒక్కడైనా అడిగుండేవాడు. కానీ ఇప్పుడు ఏదో ఒక పని దొరికితేచాలు అదే పదివేలు. అలాగే అని అంతా తలూపి, కామేశ్వరరావుకు రెండు చేతులూ ఎత్తి దణ్ణంపెట్టారు. కామేశ్వరరావు కొంచెం తడబడి, చెయ్యి వూపి, వెనుతిరిగి సిమెంటుబస్తాలున్న రేకు షెడ్లోకెళ్ళిపోయాడు.

''రండి... మీ పేర్లు చెప్పండి'' అని మేస్త్రీ నోటుపుస్తకం, పెన్నుపట్టుకుని బెంచీ మీద కూర్చున్నాడు.

''నీ పేరు''

''గన్నియ్య''

''.............''

''రామన్న''

''కాంతం అండి''

''సూరడండి''

''లచ్చన్న''

''.........''

''లోవరాజు''

''వెంకమ్మండి....'' *(విపుల మాసపత్రిక, నవంబర్ 1986)*